సంపుటి :02 సంచిక :120 పేజీలు :06

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

మంగళవారం 01, జూలై 2025

# ప్రతి ఠాణా పరిధిలో వీపీఓలు




05

- ఉదయం 6 గంటల వరకు పెట్రోలింగ్
- ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

# సేవలతో వైద్య వృత్తికి న్యాయం

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ఘనంగా వైద్యుల దినోత్సవం

05






03

# కోట్ల ఆస్తి... కనికరం లేని కొడుకులు

## ఆస్తి పంచినా... రేకుల షెడ్డుకు పరిమితమైన వృద్ధ దంపతుల చేదు కథ

ఒక దంపతులు జీవితంతా కష్టపడి సంపాదించిన కోట్లు విలువైన భూమిని తనయుల భవిష్యత్తు కోసం ప్రేమతో పంచి పెట్టారు. కానీ... వారే చివరికి తిండికీ తిప్పలు పడే స్థితికి చేరుకున్నారు. ఓ చోట తల్లిదండ్రులు జీవితాన్ని అంకితం చేస్తే, మరోవైపు కొడుకులు ఆ ప్రేమకు మొలకెత్తని చెట్టు లాగా నిశ్శబ్దంగా మానవత్వాన్ని తాకట్టు పెట్టారు. హనుమకొండ కలెక్టరేట్ ఎదుట న్యాయం కోసం ప్రదక్షిణలు చేస్తున్న వృద్ధ దంపతుల కన్నీటి కథ ఇది. ఎవరూ పట్టించుకోని ఈ విషాదం వెనుక... రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమూ ఉంది.

– అక్షరదర్బార్, హనుమకొండ ప్రతినిధి

# మండలానికో డ్రోన్

- జిల్లాలో పంపిణీకి అందుబాటులో 12 డ్రోన్లు
- వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతకు ప్రోత్సాహం
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

03

# ఆన్‌లైన్‌లో సైబర్ దొంగలు పడ్డారు !

ఫేక్ యాప్స్, ఏపీకే ఫైల్స్ తో జాగ్రత్త

వరంగల్ నగరానికి చెందిన ఓ యువకుడి వాట్సాప్ కు 'పీఎం కిసాన్ యాప్' (PM KISAN SAMMAN.APK) పేరుతో ఒక లింక్ వచ్చింది. పీఎం కిసాన్ సమ్మాన్ డబ్బులు ఖాతాలో జమ అయ్యాయో లేవో చెక్ చేసుకునే లింక్ అని ఆ మెసేజ్ లో లో రాసి ఉన్నది. యువకుడు లింక్ ఓపెన్ చేశాడు. అంతే.. సైబర్ క్రైం దొంగలు తన మూడు అకౌంట్లలోని రూ.1.50 లక్షల నగదును కొల్లగొట్టారు. హనుమకొండకు చెందిన ఓ మహిళ మొబైల్ కు ప్రముఖ బ్యాంక్ కు సంబంధించిన ఏపీకే ఫైల్ లింక్ వచ్చింది. 'మీ బ్యాంక్ ఖాతాను ఆధార్ అప్‌డేట్ చేయాల్సి ఉన్నది. దయచేసి ఈ లింక్ తెరిచి అప్‌డేట్ చేసుకోండి' అని రాసి ఉంది. వెంటనే ఆ మహిళ లింక్ చేసింది.. ఇక అంతే.. తన రెండు బ్యాంక్ అకౌంట్ల నుంచి సైబర్ దొంగలు రూ.15 లక్షలు దోచేశారు.

02

ఇలా.. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ సైబర్ నేరాలు వెలుగుచూస్తున్నాయి. సైబర్ నేరాల బారిన పడి, డబ్బు పోగొట్టుకోకూడదంటే మొబైల్ వినియోగించే ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాల్సిందే. ఆ జాగ్రత్తలు తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే..

- అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి




- వాట్సాప్ లో పీఎం కిసాన్ పథకం, బ్యాంక్ లింక్ లు చక్కర్లు
- లింక్ ఓపెన్ చేశారా..? డబ్బులు గోవిందా !
- ఫేక్ నగ్న వీడియోల జోలికి వెళ్లకండి
- సైబర్ నేరగాళ్ల వేధింపులకు గురికాకండి
- ఎవరైనా మోసపోతే 1930కి కాల్ చేయండి

# చిన్న వయసు... పెద్ద నేరం!

వీధుల్లో వెళ్తే కనిపించేది ట్రాక్టర్ శబ్దం... కానీ దానిని నడిపించే వయసు చూసి ఆశ్చర్యపోవాల్సిందే! కాటారం మండలం విలాసాగర్ శివారులోని మానేరులో ఇసుక దందా మామూలుగా సాగట్లేదు. ట్రాక్టర్, లారీలు అడ్డదిడ్డంగా దూసుకెళ్తున్నాయి. అయితే... వీటిని నడుపుతున్నవారు చాలా మంది తీనేజ్ మైనర్లు. డ్రైవింగ్ లైసెన్స్ ఉండదు, అనుభవం ఉండదు – కానీ ఇసుక మాఫియా వారికి వాహనాన్ని అప్పగించేస్తోంది. వాళ్లకు నిద్రలేని రాత్రులు, నిబంధనలే తెలియని వయస్సు.. కానీ చేతిలో స్టీరింగ్. ట్రాఫిక్, భద్రత, న్యాయవ్యవస్థ... అన్నీ మట్టికరిచేలా వీరు అడ్డదిడ్డంగా దూసుకెళ్తున్నారు.

- అక్షర దర్బార్, కాటారం

- ఇసుక మాఫియాలో మైనర్లే రన్నర్లుగా
- నిబంధనల ఉల్లంఘన

06



## ఆన్ లైన్ లో

# సైబర్ దొంగలు

- ఫేక్ యాప్స్, ఏపీకే ఫైల్స్తో జాగ్రత్త
- వాట్సాప్ లో పీఎం కిసాన్ పథకం, బ్యాంక్ లింక్స్ చక్కర్లు
- లింక్ ఓపెన్ చేశారా..? డబ్బులు గోవిందా !
- ఫేక్ నగ్న వీడియోల జోలికి వెళ్లకుండి
- సైబర్ నేరగాళ్ల వేధింపులకు గురికాకండి
- ఎవరైనా మోసపోతే 1930కి కాల్ చేయండి




అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: . కాజీపేటకు చెందిన ఓ వైద్యురాలికి ఒక కాల్ వచ్చింది. తాను టెలికాం డిపార్ట్మెంట్లో పనిచేస్తున్నానని చెప్పి 'మీ ఆధార్ కార్డుతో ఎవరో కొత్త సిమ్ తీసుకున్నారు. ఆ సిమ్ హోల్డర్పై కేసు నమోదైంది' అని వైద్యురాలికి చెప్పారు. ఆ తర్వాత ముంబయి సైబర్ క్రైమ్ డిపార్ట్మెంట్ పేరుతో ఆమెకు వాట్సప్లో ఓ సందేశం వచ్చింది. కేసుకు సంబంధించి వ్యక్తిగత వివరాలు కావాలని అడగ్గా.. ఆమె పంపించారు. కొన్నాళ్ల తర్వాత అదే వాట్సప్ నంబరు నుంచి కాల్ వచ్చింది. ముంబయి క్రైం బ్రాంచ్లో పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి అంటూ మాట్లాడిన అవతలి వ్యక్తి.. మనీలాండరింగ్ కేసులో వైద్యురాలి పేరు ఉన్నట్లు తెలిపాడు. ఓ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఆయన ఇంట్లో తనిఖీ చేస్తుండగా వైద్యురాలి పేరుతో ఉన్న బ్యాంక్ అకౌంట్, డెబిట్ కార్డు దొరికినట్లు చెప్పాడు. ఈ కేసులో శిక్ష పడుతుందని బెదిరించాడు. కేసుకు సంబంధించిన పత్రాలంటూ ఫేక్ డాక్యుమెంట్లను కూడా వాట్సప్ చేశాడు. దీంతో బాధితురాలు భయపడింది. అనంతరం పోలీసు దుస్తుల్లో వీడియోకాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నామని చెప్పారు. ఎక్కడికీ వెళ్లొద్దని చెప్పి.. పరిశీలన కోసం ఖాతాల్లో ఉన్న డబ్బును వేర్వేరు ఖాతాల్లోకి బదిలీ చేయాలని బెదిరించాడు. కేసు గురించి ఆందోళన పడిన ఆమె.. అతడు చెప్పినట్లుగా దాదాపు రూ.30 లక్షలు బదిలీ చేసి మోసపోయింది. ఇలా సైబర్ నేరగాళ్లు కొత్త పంథా అనుసరిస్తున్నారు. కేసుల్లో ఇరుక్కున్నారంటూ నమ్మించి వారిని భయం, ఒత్తిడికి గురిచేస్తున్నారు. దాన్ని ఆసరాగా తీసుకుని ఆ తర్వాత డబ్బులు దండుకుంటున్నారు. మరి కొందరు నేరగాళ్లు వాట్సాప్లో ఏపీకే లింక్స్ వైరల్ చేసి, అవి ఓపెన్ చేసిన వారి బ్యాంక్ ఖాతాలు ఆపరేట్ చేస్తున్నారు. ఖాతాల్లో ఒక్కపైసా అయినా మిగల్చకుండా కొల్లగొడుతున్నారు. ఇలాంటి నేరాలపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా.. ఇంకా పలువురు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మోసపోతున్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరాల బారిన పడి మోసపోతే, వెంటనే 1930 టోల్ఫ్రీ నంబరుకు కాల్ చేయాలి. స్థానిక పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయాలి.

### - పెట్టుబడుల పేరుతో లింక్లు..

ఈ మధ్య కొందరి వాట్సప్కు పెట్టుబడులకు సంబంధించిన సందేశాలు వస్తున్నాయి. తాము చెప్పిన సంస్థల్లో పెట్టుబడులు పెడితే సాయంత్రానికల్లా భారీగా లాభాలు వస్తాయన్నది ఆ మెసేజ్ల సారాంశం. అది నమ్మిన కొందరు వారు చెప్పిన ఖాతాల్లో డబ్బువేసి పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టారు. తొలుత భారీగా లాభాలు వచ్చినట్లు కనిపించేది. కానీ విత్డ్రా చేసుకోవాలంటే మాత్రం నిర్వాహకులు అంగీకరించడం లేదు. కొద్దిరోజులు ఆగాలని, ఇంకా లాభాలు వస్తాయని నమ్మబలుకుతున్నారు. గట్టిగా అడిగితే రకరకాల రుసుములు చెల్లించాలని వేధించేవారు. చివరకు వారందరికీ అర్థమైంది ఏమిటంటే.. తాము మోసపోయామని తర్వాత తెలుసుకున్నారు. ఆ సైబర్ నేరగాళ్లు ఎవరో తెలీదు. ఎక్కడుంటారో తెలీదు. ఒక మెసేజ్తోనో.. ఓ ఓటీపీతోనో.. ఓ క్లిక్తోనో మన డబ్బు కొల్లగొడుతున్నారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- అకారణంగా ఏ బ్యాంకూ కార్డు బ్లాక్ చేయదు. అలా చేస్తామని చెబుతూ ఎవరైనా కార్డు వివరాలు, పిన్ నెంబర్ అడిగితే అది కచ్చితంగా నకిలీ కాలే. ఎందుకంటే ఆ వివరాలన్నీ బ్యాంకు వద్ద ఉంటాయి. అడగాల్సిన పనిలేదు.
- కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్లో వెతుకుతుంటాం. వెతుకుతున్న సంస్థకు సంబంధించిన నంబర్ కనిపిస్తుంది. ఫోన్ చేయగానే అచ్చం సదరు సంస్థ ప్రతినిధులుగానే మాట్లాడతారు. ఫీజు పేరుతో క్యూఆర్ కోడ్ పంపి, దాని ద్వారా చెల్లించమంటారు. వినియోగదారుడు దాన్ని స్కాన్ చేయగానే ఖాతాలో ఉన్న డబ్బంతా ఖాళీ అవుతుంది. కాబట్టి ఫేక్ కాల్స్కు స్పందించవద్దు.
- వస్తువు కొన్నప్పుడు ఇచ్చిన బిల్లులో నంబర్కు మాత్రమే కాల్ చేయాలి. ప్రముఖ సంస్థలేవీ రిపేరు చేయకుండానే డబ్బు అడగవు.ఎవర్ని పంపుతున్నారో, ఎప్పుడొస్తారో కూడా ముందుగానే మెసేజ్ వస్తుంది. ఇవేవీ లేకుండా ముందుగానే డబ్బు పంపమని మెసేజ్ వస్తే అనుమానించాల్సిందే.
- మన మెయిల్ అడ్రస్లకు ఫేక్ ఐడీలతో కొందరు మెయిల్స్ పంపుతుంటారు. లేదంటే ఏదైనా బ్యాంకో, ప్రముఖ ప్రభుత్వ సంస్థ పేరుతోనో కూడా మెయిల్స్ వస్తుంటాయి. వీటిని తెరిచిన తర్వాత ఎటాచ్మెంట్లు మాదిరిగా కనిపిస్తుంటాయి. వీటిపై క్లిక్ చేస్తే కంప్యూటర్లో రిమోట్ యాక్సెస్ టూల్ (ర్యాట్) జొరబడే అవకాశం ఉంది. అదే జరిగితే ఆ తర్వాత ఆ కంప్యూటర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్ళినట్లే. బ్యాంకు నెట్వర్క్లోకి ఇలానే జొరబడి డబ్బు దోచేస్తారు.
- క్రెడిట్ లేదా డెబిట్కార్డు లిమిట్ పెంచుతామంటూ ఫోన్లు వస్తాయి. నేరగాళ్లు ఖాతాదారుడికి సంబంధించిన పేరు వంటి ప్రాథమిక ఆధారాలు సేకరించి పెట్టుకుంటారు. కొన్ని వివరాలు చెప్పగానే ఎవరికైనా నమ్మకం కుదురుతుంది. కార్డు, సీవీవీ నంబర్ చెబితే దాన్ని మార్చి కొత్త కార్డు పంపుతామంటారు. లిమిట్ పెరుగుతుందన్న ఆనందంలో అన్ని వివరాలు చెబుతారు. నేరగాళ్లు అప్పటికే బ్యాంకు వ్యవస్థలో ఖాతాదారుడి ఫోన్ నంబర్ కూడా మార్చుతారు. దాంతో ఈ కార్డులో డబ్బు ఖర్చుపెట్టినా సమాచారం ఖాతాదారుడికి రాదు. నెల రోజుల తర్వాత బిల్లు ఇంటికి వచ్చిన తర్వాత కాని జరిగిన దోపిడీ అర్థం కాదు.
- మనకు ఎవరైనా కాల్ చేసి డెబిట్ కార్డు, క్రెడిట్కు సంబంధించిన సీవీవీ నెంబర్ అడిగారంటేనే అది దొంగల పని అని అర్థం చేసుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ కార్డు వివరాలేవీ ఎవరికీ చెప్పొద్దు
- తక్కువ ధరకే రకరకాల వస్తువులు అమ్ముతామని ఆన్లైన్ వేదికగా కుప్పలుతెప్పలుగా ప్రకటనలు వచ్చిపడుతున్నాయి. వాటిలో ధర తక్కువ... ఇంటికే డెలివరీ అని ఊరిస్తారు. దానికి ఆశపడి డబ్బు చెల్లించారో.. ఒక్కోసారి అసలు సరుకే రాదు. లేదా పార్సిల్లో చిత్తుకాగితాలేవో పెట్టి పంపుతారు. జరిగిన మోసం గురించి చెబుదామంటే ప్రకటనలోని నంబర్ పనిచేయదు. ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదు
- సైబర్ నేరగాళ్ల కొత్త పంథా వాయిస్ క్లోనింగ్. కృత్రిమ మేధ సాయంతో ఎవరి గొంతునైనా సృష్టిస్తున్నారు. నకిలీ స్వరం పుట్టించి ఆయన కింద పనిచేసే ఉద్యోగుల కాల్ చేసి, వారి నుంచి డబ్బులు గుంజుతారు.
- రకరకాల పద్ధతుల్లో ఫోన్ నంబర్లు సేకరిస్తున్న నేరగాళ్లు అందమైన అమ్మాయిలతో ఫోన్లు చేయిస్తారు. కొద్దిగా పరిచయం కాగానే వీడియోకాల్ మాట్లాడుకుందామని ముగ్గులోకి దించుతారు. వీడియో కెమెరా ముందే నగ్నంగా మారిపోయి.. సదరు వ్యక్తిని కూడా నగ్నంగా మారమంటూ కవ్విస్తారు. ఆ మాటలకు లొంగితే ఇక అయిపోయినట్లే. ఆ వ్యవహారం అంతా చాటుగా రికార్డు చేస్తారు. ఆ వెంటనే బేరం మొదలుపెడతారు.
- ఫలానా బ్యాంకు క్రెడిట్ కార్డు వాడుతున్నారు కాబట్టి మీకు పెద్దమొత్తంలో రివార్డు పాయింట్లు వచ్చాయని చెబుతారు. ఆ తర్వాత ఒక క్యూఆర్ కోడ్ పంపుతారు. దీన్ని స్కాన్ చేస్తే పాయింట్ల తాలూకు డబ్బు జమ అవుతుందంటారు. అలాగానీ చేశారో డబ్బు వచ్చే సంగతి అటుంచి ఖాతాలో ఉన్న మొత్తం ఖాళీ అవుతుంది.
- ఈ– కామర్స్ సంస్థలు ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీలు, స్క్రాచ్కార్డులు పంపి బహుమతులు ఇవ్వవు. వ్యక్తిగతంగా ఫోన్ చేయడం లేదా సందేశం ద్వారా సంప్రదింపులు జరపవు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వాట్సాప్ సందేశాలు పంపించి ఏదైనా లింకు క్లిక్ చేయాలని సూచిస్తే నమ్మొద్దు. ఆఫర్ గెలుచుకోవాలంటే ముందస్తుగా డబ్బు అడిగితే మోసమని గుర్తించాలి. అధికారిక వెబ్సైట్లలోనే షాపింగ్ చేయాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులు, ఆఫర్లని చూసి మోసపోవద్దు.

**వాట్సాప్ లో చక్కర్లు కొడుతున్న లింకులివే..**

Aadhar.Apk

SBI.Apk

pm kisan.Apk

Unions Bank.Apk

Cse.Apk


Statebank.Apk

Ekyc apk

**పై తరహా లింక్స్ ఎక్కడ కనిపించిన వాటికి దూరంగా ఉండండి. దయచేసి ఆ ఫైల్స్ ఓపెన్ చేయకండి. ఒకవేళ చేశారంటే.. ఇక మీ ఫోన్ హ్యాక్ అయినట్లే. మీ బ్యాంక్ ఓటీపీలు, మెసేజ్లన్నీ సైబర్ దొంగలకు వెళ్తాయి. నిమిషాల్లో మీ ఖాతాల్లో డబ్బులు ఖాళీ అవుతాయి.**

### - డిజటల్ నేరాలు..

**మీ పేరుతో ఉన్న సిమ్ ఆధారంగా మనీలాండరింగ్ నేరంలో ఇరుక్కున్నారని ఫోన్ వస్తుంది. ఈడీ కేసులో ముంబయి కోర్టు మీపై వారెంట్ జారీ చేసిందని చెబుతారు. మీరు డిజిటల్ అరెస్ట్ అయ్యారని.. మాకు తెలియకుండా ఇంటి బయటికి వెళ్లొద్దని హెచ్చరిస్తారు. వాట్సప్ లేదా స్కైప్ వీడియోకాల్ ద్వారా పోలీస్ దుస్తుల్లో ఉన్న వ్యక్తి లైన్ లోకి వస్తాడు. మీకు నేరంతో సంబంధంలేదని నిరూపించుకునేందుకు మీ బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము, ఎఫ్ డీలు, ఎల్ ఐసీ బాండ్లు.. ఇలా అన్నింటినీ ముందుగా ఆర్ బీఐ ఏర్పాటుచేసిన ఖాతాలోకి మళ్లించాలని ఒత్తిడి చేస్తారు. మొత్తం ఊడ్చేసిన తర్వాత ఒకట్రెండు రోజుల్లో దర్యాప్తు పూర్తవుతుందని.. తర్వాత మీ సొమ్ము తిరిగి మీ ఖాతాకు బదిలీ అవుతుందని చెప్పి జారుకుంటారు. బ్యాంకు కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని చెబుతూ బిల్లు చెల్లింపులో జరిగిన పొరపాటు కారణంగా కార్డు బ్లాక్ చేస్తున్నామని బెదిరిస్తారు. అలా ఎందుకు చేస్తున్నారని అడిగితే తమకు వచ్చిన ఆదేశాలు అలా ఉన్నాయంటారు. ఇప్పుడేం చేయాలని అడగ్గానే పూర్తి వివరాలు ఇస్తే తమ పై అధికారులతో మాట్లాడి విషయం పరిష్కరిస్తామనంటూ పిన్ నంబర్ తో సహా ఖాతాదారుడితోనే చెప్పిస్తారు. వాటి ఆధారంగా కార్డులో ఉన్నదంతా దోచేస్తారు.**



# మండలానికో డ్రోన్

- జిల్లాలో పంపిణీకి అందుబాటులో 12 డ్రోన్లు
- వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతకు ప్రోత్సాహం
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షరదర్బార్, భూపాలపల్లి: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగానికి సంఘాలను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో రైతు ఉత్పత్తి సంఘాలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, సహకార సంఘాలకు డ్రోన్స్ పంపిణీపై వ్యవసాయ, ఉద్యాన, సహకార, డీఆర్డీఓ, నాబార్డ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించేందుకు డ్రోన్ల వినియోగంపై చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో పంపిణీ చేసేందుకు 12 డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని మండలాల వారీగా ఒక్కో మండలానికి ఒక డ్రోన్ చొప్పున పంపిణీ చేయాలని తెలిపారు. ఇందుకోసం విజయవంతంగా నడుస్తున్న రైతు ఉత్పత్తి సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాల నుండి సభ్యులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ మూడు కేటగిరీల సంఘాలను ప్రామాణికంగా తీసుకుని మండలానికి ఒకటి చొప్పున అన్ని మండలాలు కవరు అయ్యేలా డ్రోన్లు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ బాబు, ఉద్యాన వన శాఖాధికారి సునీల్ కుమార్, డీఆర్డీఓ బాలకృష్ణ, డీసీఓ వాల్యానాయక్, నాబార్డు ఈజీఎం చంద్ర శేఖర్ పాల్గొన్నారు.





# భూమి లాక్కొని గెంటేశారు!

- కోట్లు సంపాదించినా రేకుల షెడ్డుకే పరిమితమైన వృద్ధులు
- పట్టించుకోని కొడుకులు
- న్యాయం కోసం కలెక్టరేట్ చుట్టూ బాధిత దంపతుల ప్రదక్షిణలు
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం



అక్షరదర్బార్, హనుమకొండ ప్రతినిధి : ఆ వృద్ధ దంపతులు కడుపు మాడ్చుకుని కాయ కష్టం చేసి రూ.కోట్ల ఆస్తి కూడ బెట్టారు. కూతుళ్లకు ఘనంగా పెళ్లి చేసి అత్తారింటికి సాగనంపారు. మిగిలిన ఆస్తిని కొడుకులిద్దరికి సమానంగా పంచి ఇచ్చారు. అలాంటి వారిని చివరి దశలో కష్టపెట్టకుండా చూడాల్సిన కొడుకులు ముసలి దంపతులను బయటకు నెట్టేసి రేకుల షెడ్డు పాలు చేసారు. తినడానికి తిండి లేక కష్టాలు పడుతున్న బాధిత దంపతులు న్యాయం చేయాలంటూ హనుమకొండ కలెక్టర్ ను కలిసి వేడుకున్నారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో కాజీపేట మండలం రాంపూర్ కు చెందిన చాందరాజు నారాయణ, శాంతమ్మ దంపతులు పాల వ్యాపారం చేసి రూ.కోట్ల ఆస్తి సంపాదించారు. పిల్లలందరిని ప్రయోజకులను చేసారు. వారు సంపాదించిన 10 ఎకరాల భూమి, ఇంటిని ఇద్దరు కొడుకులకు సమానంగా పంచి ఇచ్చారు. ఇదే వారి పాలిట శాపంగా మారింది. రూ.కోట్లు పంచి ఇచ్చిన తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడు కోవాల్సిన కొడుకులు రేకుల షెడ్డుకు పరిమితం చేశారు.

**- వృద్ధ దంపతుల గోస..!**

రూ.కోట్లు సంపాదించిన వృద్ధ దంపతులు ఆకలి కోసం అలమటిస్తున్నారు. రోగమొస్తే దవాఖానకు తీసుకుపోయే నాథుడు లేక బోరున విలపిస్తున్నారు. కొడుకులు బాగా చూసుకుంటారని నమ్మి ఆస్తులు అప్పగిస్తే బయటికి నెట్టేసారని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని గత నెలలో కలెక్టర్ ను కలిసి వేడుకున్నామని, ఐనప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సోమవారం మరోసారి కలెక్టర్ ను కలిసి మొర పెట్టుకున్నట్లు బాధితులు తెలిపారు.

**- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం..!**

వృద్ధ దంపతుల విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. గత నెల బాధిత వృద్ధ దంపతులు గ్రీవెన్స్ లో అప్పటి కలెక్టర్ ప్రావీణ్యను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఆమె వెంటనే విచారణ చేసి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ అంతగా స్పందించని స్థానిక రెవెన్యూ అధికారులు వృద్ధ దంపతుల సమస్యను పక్కన పెట్టారు. ఈ క్రమంలో ఆ కలెక్టర్ బదిలీ కావడంతో వృద్ధుల సమస్య మొదటికొచ్చింది. దీంతో బాధితులు తాజాగా సోమవారం కొత్త కలెక్టర్ ను కలిసి తమ సమస్యను విన్నవించారు. తమను మాయ చేసి స్వాధీనం చేసుకున్న భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో పెట్టిన కొడుకులు తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ అధికారులను కలిస్తే వారు కూడా తమ కొడుకుల వైపే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని తమకు న్యాయం చేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# నేతన్నల రుణాలను సంపూర్ణంగా మాఫీ చేయాలి

**డా. పరికిపండ్ల అశోక్**



అక్షర దర్బార్ : హైదరాబాద్ : చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని వారి రుణాలను ఎలాంటి పరిమితులు లేకుండా పూర్తిగా మాఫీ చేయాలని చేనేత ఐక్యవేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డా. పరికిపండ్ల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల చేనేత శాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో లక్ష రూపాయల లోపు రుణాలకే మాఫీ వర్తిస్తుందని చెప్పిన తీర్మానం అన్యాయమని ఆయన వ్యాఖ్యానించారు. కార్మికులు అప్పుల భారంతో సతమతమవుతుండగా, వడ్డీ మాఫీ లేకపోవడం బాధాకరమన్నారు. 6600 మంది చేనేత కార్మికుల రుణమాఫీకి రూ. 33 కోట్లు మాత్రమే అవసరమవుతుందని, అసలు–వడ్డీతో కలిపి సంపూర్ణ రుణమాఫీ చేయాలని డా. అశోక్ కోరారు. అలాగే, గత పదేళ్లుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరగకపోవడం వల్ల సహకార వ్యవస్థ నష్టపోయిందని, తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



అక్షర దర్బార్ : దోర్నకల్/మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా దోర్నకల్, కురవి, సిరోలు మండలాల్లో మంగళవారం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ విస్తృత పర్యటన నిర్వహించారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ఉండేందుకు సానిటేషన్, పోషకాహారం, విద్య, ఆరోగ్య రంగాల్లో సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి హాజరు పట్టికలు, మందుల నిల్వలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవగాహన, ముందస్తు మందుల నిల్వ, షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. వెన్నారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించాలన్నారు. అనంతరం మన్నెగూడెం జెడ్పీ హై స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, ఏఐ ఆధారిత బోధనను పరిశీలించారు. వెన్నారం ప్రాథమికోన్నత పాఠశాలలోనూ పరిశీలన నిర్వహించిన కలెక్టర్, పెరుగుదలపై భౌతిక వసతులు, మధ్యాహ్న భోజనంపై సూచనలు చేశారు.

# ఎంబీసీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

**జులై 12 దరఖాస్తులకు చివరి తేదీ**

అక్షర దర్బార్, మహబూబాబాద్ : తెలంగాణ అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ (టీజీఎంబీసీడీసీ), హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ యువకులకు నాలుగు రోజుల ఉచిత నైపుణ్య శిక్షణను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. శిక్షణలో సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్, మాక్ ఇంటర్వ్యూలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ట్రావెలింగ్ అలవెన్స్, భోజనం, వసతి సదుపాయాలు కల్పించనున్నారు. వయస్సు 21–30 మధ్య, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత ఉన్న ఎంబీసీ అభ్యర్థులు 28 జూన్ నుంచి 12 జూలై లోపు tgobmms.cgg.gov.inలో ఆన్లైన్ దరఖాస్తు చేసి, సంబంధిత పత్రాలతో ఈ నెల 14న సాయంత్రం 5:00 లోపు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలి.

# బీజేపీ స్టేట్ చీఫ్ గా రామచందర్ రావు బాధ్యతలు

- బాధ్యతల నుంచి వైదొలిగిన కిషన్ రెడ్డి
- అధికారికంగా ప్రకటించిన పార్టీ కేంద్ర ఎన్నికల అధికారి శోభ
- రామచంద్రరావుకు ఎంపీలు, ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్.రామచందర్‌రావు ఎన్నికైనట్టు ఆ పార్టీ కేంద్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కేంద్రమంత్రి శోభా కరంద్లాజే మంగళవారం అధికారికంగా ప్రకటించారు. హైదరాబాద్లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈమేరకు రామచందర్‌రావుకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శోభా కరంద్లాజే మాట్లాడుతూ.. ఏకగ్రీవంగా ఎన్నిక పూర్తి కావడం పార్టీ శ్రేణులకు ఆనందాన్నిస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నర కాలంలోనే విమర్శలు మూటగట్టుకుందన్నారు. తెలంగాణ ప్రజలు ఇప్పుడు బీజేపీ వైపే చూస్తున్నారని పేర్కొన్నారు. కర్ణాటక, తెలంగాణలో ఏటీఎం రెండు సర్కార్‌లకు ఉన్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని పార్టీ నేతలకు సూచించారు. రామచందర్‌రావుకు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, లక్ష్మణ్, పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.




# ఆయిల్ పాం సాగుతో అధిక ఆదాయం

### మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

అక్షర దర్బార్ , కురవి/మహబూబాబాద్ : ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు స్థిరమైన, అధిక ఆదాయం పొందవచ్చని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. మంగళవారం కురవి మండలం బలపాల గ్రామంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఆయిల్ పామ్ ప్లాంటేషన్ మెగా మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పంట ద్వారా నెలనెలా ఆదాయం లభించే అవకాశం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తుందని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న వివరిస్తూ, ఆయిల్ పామ్ పంట ద్వారా ప్రతి ఎకరాకు పది టన్నుల దిగుబడితో రూ. 1 లక్షకు పైగా ఆదాయం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 8000 ఎకరాలపై సాగు జరుగుతోందని, ఇందులో 1350 ఎకరాల్లో దిగుబడి ప్రారంభమైందని, ఈ ఏడాది 4500 ఎకరాల లక్ష్యంతో ఇప్పటివరకు 663 ఎకరాలకు రైతులు అనుమతి పొందినట్టు పేర్కొన్నారు. కూరగాయల సాగు విషయంలోనూ ఆధునిక పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, వేప నూనె పిచికారి వంటి పద్ధతులను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆయిల్ ఫెడ్ సిబ్బంది, గ్రామ అధికారులు పాల్గొన్నారు.






# దుగ్గొండి మండలాన్ని నేనే అభివృద్ధి చేశా

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- బీఆర్ఎస్ లో భారీగా చేరికలు

అక్షర దర్బార్, దుగ్గొండి: మునుపటి పాలనలో దుగ్గొండి మండలానికి అన్ని విధాల అభివృద్ధి చేశానని, ఈ ఘనత ముమ్మాటికీ తనదే అని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం దుగ్గొండి మండలం గిర్నిబావిలో జీఆర్బీ ఏసీ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు సిగ్నల్ రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ గారి ఆశీస్సులతో తన కాలంలో తెచ్చిన నిధులతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, గెలిచిన ఎమ్మెల్యేలు గత 19 నెలలుగా ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. రైతుల పంట నష్టపరిహారం నుంచి పల్లె ప్రగతి వరకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ఆరు హామీలు వాస్తవానికి మోసమే అని, మహిళలు, యువకులు, వృద్ధులకు ఇచ్చిన హామీలు అమలు కానప్పటి వరకు కాంగ్రెస్ నేతలకు గ్రామాల్లో ఓట్లు అడిగే న్యాయం లేదన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. నాచినపల్లి మాజీ సర్పంచ్ పెండ్యాల మమత రాజు, గుడిమహేశ్వరం మాజీ సర్పంచ్ ఆడుపా సుధాకర్, 100 కుటుంబాలను సుదర్శన్ రెడ్డి గులాబీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్, నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 40కి చేరిన మృతుల సంఖ్య

- పాశమైలారంలో రియాక్టర్ పేలుడు ఘటన
- ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న క్షతగాత్రులు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

**అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఘటనలో మృతుల సంఖ్య మంగళవారానికి 40కి చేరింది. పలువురు ఇప్పటికీ ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్నారు. మరోవైపు పరిశ్రమ వద్ద భవనం, శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్నారు. వెలికితీస్తున్న మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలిస్తున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 11 మంది పరిస్థితి పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ కూడా మృతిచెందారు. ఆయన ప్లాంట్‌లోకి అడుగుపెడుతున్న సమయంలో పేలుడు సంభవించింది. ప్రమాద ధాటికి ఆయన కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో మృతుల వివరాలు తెలుసుకునేందుకు బంధువులు, కుటుంబ సభ్యుల కోసం అధికారులు సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వివరాలకు 08455 276155ను సంప్రదించాలని సూచించారు.

### - పరిశ్రమల భద్రతపై త్వరలో కమిటీ

ప్రమాద స్థలాన్ని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ సందర్శించారు. ఘటనపై పోలీసులు, అధికారులను ఆరా తీశారు. పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఓ కమిటీ వేస్తామని మంత్రి తెలిపారు. ఎక్కువ పని గంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అన్ని విభాగాల అధికారులు సత్వరమే స్పందించారని, ప్రమాదానికి గల కారణాలను ఇప్పుడే చెప్పలేమన్నారు. ఈ పరిశ్రమలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. గత 40 ఏళ్లుగా పరిశ్రమ నడుస్తున్నదన్నారు.

## కారు-బైక్ ఢీ..

### ఒకరు మృతి, మరొకరు తీవ్ర గాయాలు

అక్షర దర్బార్, భీమదేవరపల్లి : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వద్ద మంగళవారం మధ్యాహ్నం కారు–బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి, వెంకటేష్ బైక్‌పై కొత్తకొండ నుండి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీహరి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వెంకటేష్‌ను హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.



## ‘చలో ఈదుముడి’ పోస్టర్ ఆవిష్కరణ



అక్షర దర్బార్, పరకాల : తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో చలో ఈదుముడి పోస్టర్ ను పరకాల సీఐ క్రాంతికుమార్ ఆవిష్కరించారు. జూలై 7న ప్రకాశం జిల్లాలోని ఈదుముడిలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించడం జరుగుతుంది. సమావేశానికి తెలంగాణ మాదిగ జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్, టీఎంజెఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడెపాక భాస్కర్, జిల్లా నాయకులు ఒంటెరు రమేష్ చంద్ర , రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ బీసీ ద్రోహుల పార్టీ

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్ చార్జి విజయ గిరి సమ్మయ్య



అక్షర దర్బార్, మల్హర్: తెలంగాణలో బీసీలను నమ్మించి చివరికి మోసం చేసిన బీజేపీకి వచ్చే ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి విజయ గిరి సమ్మయ్య అన్నారు. మంగళవారం కొయ్యూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీలకు ఇస్తామన్న బీజేపీ చివరికి బ్రాహ్మణ వర్గానికి చెందిన రామచందర్ రావుకు పగ్గాలు అప్పగించి బీసీలను అవమానించిందన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వకుండా, ఒక శాతం ఉన్న వర్గానికి పదవి కట్టబెట్టి బీసీలపై వివక్ష చూపిందని విమర్శించారు. గతంలో బీసీని సీఎం చేస్తామన్న బీజేపీ, చివరికి ఫ్లోర్ లీడర్ పదవికూడా అగ్రకులానికి ఇచ్చిందని గుర్తుచేశారు.  బీజేపీ ఇప్పుడు తెలంగాణలో బ్రాహ్మణ జనతా పార్టీగా మారిందని, బీసీలను ద్రోహం చేసిన ఈ పార్టీకి త్వరలో బీసీలు రాజకీయంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# కేటీపీపీ క్వార్టర్స్ లో చోరీ కలకలం

- 10 ఇండ్లలో చోరీ ఘటన
- మూడు లక్షల నగదు, మూడు తులాల బంగారం చోరీ
- క్లూస్ టీం సహాయంతో ముమ్మర దర్యాప్తు



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ వద్ద నిర్మించిన కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో ఉద్యోగుల క్వార్టర్స్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న భారీ చోరీ స్థానికంగా కలకలం రేపింది. సమాచారం ప్రకారం, ప్రాజెక్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు కేటాయించిన దాదాపు 10 ఇండ్లలో ఒక్కసారిగా చోరీలు జరిగాయని బాధితులు తెలిపారు. చోరీ జరిగిన ఇళ్లలో ఉంచిన మూడు లక్షల రూపాయల మేర నగదు, మూడు తులాల బంగారం ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లినట్టు బాధితులు వాపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న గణపురం పోలీసులు రాత్రి తక్షణం సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్‌టీం సహాయంతో ఆధారాల సేకరణ ప్రారంభించారు.

# అక్రమ భూవిక్రయాలపై చర్యలు తీసుకోవాలి

చిట్యాల, అక్షర దర్బార్: చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో ప్రభుత్వ భూములను కొందరు అక్రమంగా అమ్ముతున్నారని విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్ ఆరోపించారు. ఈ విషయంపై మంగళవారం ఎమ్మార్వో ఇమామ్ బాబాకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూములను దళారులు ఎలాంటి హక్కు లేకుండా విక్రయిస్తున్నారని, వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్వో తక్షణమే విచారణ చేసి భూములను కాపాడుతానని హామీ ఇచ్చారు.





# డ్రైన్ నిర్మాణానికి చర్యలు

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి పోతన జంక్షన్, బీట్ బజార్ ప్రాంతంలో పరిశీలన

అక్షరదర్బార్, వరంగల్: డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి వరంగల్ ప్రాంతంలోని పోతన జంక్షన్ బీట్ బజార్ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పోతన జంక్షన్ ప్రాంతంలో గల 12 మోరీల జంక్షన్ ను విస్తరించాలని, బీట్ బజార్ లో కల్వర్టు నిర్మించాలని, 12 మోరీల వరకు డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అన్నారు. నవీన్ థియేటర్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులను మేయర్, కమిషనర్ లు పరిశీలించారు. ఇదే ప్రాంతంలో చేతి పంపు పనిచేయడం లేదని స్థానికుల ఫిర్యాదు మేరకు మరమత్తులు చేయించాలని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైన్ ల ఔట్ ఫ్లో బయటకు వెళ్ళేలా చూడాలని, వర్షాకాలం నేపథ్యంలో డ్రైన్ ను ఎప్పటికపుడు క్లీన్ గా ఉంచుతూ వర్షం నీరు సులువుగా వెళ్లిపోయేలా ఉండాలన్నారు. వర్షపు నీరు నిలువ ఉండకుండా లెవెల్స్ సరి చూడాలని, బీట్ బజార్ ప్రాంతంలో డ్రైన్ సమస్యను పరిష్కరించాలని మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ ఓ డా రాజారెడ్డి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ ఓ డారాజేష్, ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, టీపీఎస్ లు యెర్షాద్, అనిల్, డీఈ రాజ్ కుమార్, ఏఈలు రాగి శ్రీకాంత్, హబీబ్, సానిటరీ ఇన్ స్పెక్టర్ శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సోదా పరామర్శ



అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణానికి చెందిన ఏకు ఈశ్వర్ కూతురు సోమవారం మల్లక్కపేట సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకోగా ఆమె కుటుంబ సభ్యులను, డ్రైవర్ ఎండీ రషీద్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సోదా రామకృష్ణ పరామర్శించారు. వారితోపాటు సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఏకు రాజు తదితరులు పాల్గొన్నారు.

# సేవలతో వైద్య వృత్తికి న్యాయం

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఘనంగా వైద్యుల దినోత్సవం




అక్షరదర్బార్, హనుమకొండ:ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా వైద్యవృత్తికి న్యాయం చేకూర్చడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిస్ అన్నారు. బీఎస్ రాయ్ వైద్యరంగంలో చేసిన సేవలకు గుర్తుగా జులై 1న భారతదేశంలో డాక్టర్స్ డే నిర్వహించుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో డాక్టర్స్ డే పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజలను చేసి కలెక్టర్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్య అధికారులకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేదవాడికి వైద్యం అందాలని, ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, తాను కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యానని, ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యేలా ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీని ప్రోత్సహించాలని కోరారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు వినియోగించుకోవాలని, ప్రతి వైద్యుడు అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ల సేవలు మరువలేనివని అందరికీ జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కె రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్ సేవలు మర్చిపోలేనివని, ప్రతి పేదవానికి వైద్య సేవలు అందాలని, ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకొస్తున్నదని అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిద్దామని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించేలా, నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె రామ్ కుమార్ రెడ్డి, అడిషనల్ వైద్య అధికారి డాక్టర్ టి మద మోహన్ రావు, జిల్లా ఇమ్యూనిజషన్ అధికారి డాక్టర్ మహేందర్, జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ హిమబిందు, ప్రోగ్రామ్ అధికారి ఎంసీహెచ్ డాక్టర్ మంజుల, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇన్ సిడి డాక్టర్ అహ్మద్ ని జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించారు.

# ప్రతి ఠాణా పరిధిలో వీపీఓలు

- ఉదయం 6 గంటల వరకు పెట్రోలింగ్
- ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ: నేరాల నియంత్రణతో పాటు, నేరస్థులను పట్టుకోవడానికి పోలీస్ అధికారులు ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. జూన్ నెలకు సంబంధించి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ కు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్ష జరపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను సీపీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అర్బన్, మున్సిపల్, గ్రామ స్థాయిల్లోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి వీపీఓ వద్ద, నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇక ఉదయం 6గంటల వరకు పెట్రొలింగ్ కొనసాగించాలని ఆదేశించారు. అలాగే పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బంది నిర్వహించాల్సిన విధులపై ముందుగానే స్టేషన్ అధికారులు తెలియజెప్పాల్సి ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల అంశంపై సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిప్పుడు పోలీస్ అధికారులు సంబంధిత ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో రోడ్డు ప్రమాదాలకు గల కారణలపై క్షేత్ర స్థాయిలో సమీక్ష జరపాలని తెలిపారు. యువతను రక్షించుకోవడంలో భాగంగా డ్రగ్స్ అలవాటు పడి పోలీసులకు చిక్కిన యువతను పునరావస కేంద్రాలకు తరలించాలని కోరారు. ఫిర్యాదులపై తప్పనిసరిగా కేసులను నమోదు చేయాలని, ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, వరంగల్, జనగామ ఏఎస్పీలు శుభం, చేతన్, అదనపు డీసీపీలు ప్రభాకర్, బోనాల కిషన్, రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# 'విప్రచిత్తా' క్రమంలో శ్రీ భద్రకాళి

అక్షరదర్బార్, వరంగల్: చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు మంగళవారం అరవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి "విప్రచిత్తా" నిత్యాగాను, షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని "మహావజ్రేశ్వరి" గాను అలంకరించారు. అనంతరం అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో పూజారాధనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శేషు భారతి, ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు తగిన ఏర్పాట్లు చేశారు.



# నిరుద్యోగ యువతకు ఉపాధి మేళా

**నడికూడ యువత వినియోగించుకోవాలి**

**–ఎంపీడీవో విమల**

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో గజ్జెల విమల సూచించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా గురువారం ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పథకంతో గ్రామీణ పేద నిరుద్యోగులకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, లాజిస్టిక్స్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు.శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కూడా అందిస్తారు. అర్హులు తమ విద్యా సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలలోపు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9849131050, 9642141539 నంబర్లకు సంప్రదించవచ్చు అని తెలిపారు.

# ఆపరేషన్ ముస్కాన్-11 విజయవంతం చేయాలి

**: భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే**




అక్షరదర్బార్, భూపాలపల్లి క్రైం: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆపరేషన్ ముస్కాన్–11ను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ, తప్పిపోయిన పిల్లలను గుర్తించి, రక్షించి, పునరావాసం కల్పించే ఉద్దేశంతో ఆపరేషన్ ముస్కాన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పని ప్రదేశాల్లో దాడులు నిర్వహించి యజమానులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతేడాది ఆపరేషన్ ముస్కాన్–10లో 24 మంది పిల్లలను రక్షించినట్టు చెప్పారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే 100 లేదా 1098కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఏ. నరేష్ కుమార్, బీడబ్ల్యూ ఓ మల్లీశ్వరి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వినోద, ఇతర అధికారులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.



# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అక్షర దర్బార్, చెన్నారావుపేట: అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెన్నారావుపేట మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి తెలిపారు.మంగళవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు జల్లి గ్రామంలో లబ్ధిదారుడు మేర్గు విజేందర్‌కు ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా మద్దతు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు బాధావత్ బాలు నాయక్, మాజీ సర్పంచ్ జరుపుల మరి బిక్షం, కాటా శ్రీనివాస్, ఇరుకుల శ్రీనివాస్, మెండె భద్రయ్య, ఇతరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

అక్షర దర్బార్, మల్హర్: మండలంలోని అడ్వాలపల్లి, పెద్దతండ్ల గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాధాన్యత, మత్తు పదార్థాల వినియోగంపై కాటారం డీఎస్పీ ఏ.సూర్యనారాయణ, సీఐ ఈ.నాగార్జునరావు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీసీ కెమెరాలు గ్రామ భద్రతకు ఎంతో ఉపయుక్తమని, మత్తు పదార్థాలకు యువత అలవాటు పడకూడదని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఇక గుడుంబా స్థావరాలపై రైడ్ నిర్వహించి 48 లీటర్ల గుడుంబా, 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్ పాల్గొన్నారు.

# బాలాజీ స్కూల్లో వైద్యుల దినోత్సవం




నర్సంపేట రూరల్ లక్నెపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్లో జాతీయ వైద్యుల దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా చైర్మన్ డాక్టర్ ఎ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి పాల్గొని వైద్యుల సేవా పరమార్థాన్ని వివరించారు. విద్యార్థులు వైద్యుల వేషధారణలో ఉపన్యాసాలు, ప్రదర్శనలు చేశారు. ప్రిన్సిపాల్ పి. రాజేంద్రప్రసాద్ విద్యార్థులు వైద్య రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్.సి.సి థర్డ్ ఆఫీసర్ ఎం.డి రియాజుద్దీన్, ఉపాధ్యాయులు రమేష్, రవీందర్ రెడ్డి, రాజేష్, రాజు , ప్రీతి, అనిత,పూర్ణిమ,రాజ్ కుమార్, సునీత పాల్గొన్నారు.

# ఇసుక మాఫియాపై పట్టింపేది?

- విలాసాగర్ లో జోరుగా ఇసుక దందా
- సైలెంట్ మోడ్ లో అధికారులు
- ర్యాష్ డ్రైవింగ్ తో మైనర్ల బెంబేలు



అక్షరదర్బార్, కాటారం: కాటారం మండలం విలాసాగర్ గ్రామ శివారులోని మానేరు వాగు ప్రాంతంలో ఇసుక దోపిడీ విస్తారంగా జరుగుతున్నది. స్థానిక అవసరాల కోసం ఇచ్చిన అనుమతులను దుర్వినియోగం చేస్తూ కొందరు ఇసుక మాఫియా ఆవిష్కృతమవుతుండటం ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోంది. జీరో దందా పేరుతో రాత్రి వేళల్లో లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్న ఘటనలు పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్నాయి. విలాసాగర్ నుంచి భూపాలపల్లి వరకు రహస్య ప్రదేశాల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేసి అక్రమంగా నిల్వ చేస్తున్నారు.

అనుమతుల పేరుతో అక్రమాలకు తెరలేపిన దందా ఇసుక అవసరాల కోసం ఇచ్చిన అనుమతులను కొందరు వ్యాపారులు తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటూ, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలకు తెలిసినా వారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గృహనిర్మాణానికి ఇచ్చిన ఇసుకను దారితప్పించి వ్యాపారం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ అక్రమాల వల్ల స్థానిక ట్రాక్టర్ యజమానులు నష్టపోతున్నారని, కొందరు మహాముత్తారం, భూపాలపల్లి నుంచి ట్రాక్టర్లను రప్పించి తక్కువ రేట్లకు ఇసుకను అమ్ముతుండటంతో స్థానికుల ఆదాయం దెబ్బ తింటున్నదని వాపోతున్నారు.

## రాత్రి వేళల్లో డంపుల నుంచి ఇసుక తరలింపు

గత పది రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా లారీలలో ఇసుక తరలింపులు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో ఈ అక్రమం పెద్ద ఎత్తున నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గంగారాం ఎక్స్ రోడ్, కాటారం ప్రధాన సెంటర్‌లలోని ప్రధాన రహదారుల వెంట అక్రమంగా ఇసుక వాహనాలు తిరుగుతున్నాయి.

## మైనర్ల ర్యాష్ డ్రైవింగ్

ఇసుక దందా వాహనాలను కొందరు మైనర్లు నడిపిస్తూ ర్యాష్ డ్రైవింగ్ తో ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుతున్నారు. ఇళ్లకు దగ్గరగా వేగంగా వాహనాలు నడిపితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే పిల్లలు, వృద్ధులు రోడ్లపై నడవడానికి భయపడుతున్న స్థితి నెలకొంది.

## కఠిన చర్యలు తీసుకోవాలి

ఇసుక మాఫియాపై, మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ పై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఉద్యమం చేపట్టే పరిస్థితులు తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వైద్యులు కనిపించే దేవుళ్లు

**కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం**

అక్షర దర్బార్, భీమదేవరపల్లి : వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ రెడ్డి, సుధాకర్ హాస్పిటల్ వైద్యుడు సుధాకర్, లిటిల్ ఏంజెల్ హాస్పిటల్ వైద్యుడు స్వామిరావును సన్మానించారు. కార్యక్రమంలో మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొజ్జపూరి మురళి (శ్రీ మణికంఠ మెడికల్), మామిడాల రవీందర్ (రవీంద్ర మెడికల్), సుద్దాల జవహర్ (నవతా మెడికల్) , రాజు (సుశ్రుత మెడికల్) , యాదగిరి (కార్తికేయ మెడికల్), తౌటం రాజేష్ (మా సాయి దత్త మెడికల్) , ఉడుత శ్రీనాథ్ (స్వస్తిక్ జనరిక్ ఫార్మసీ) తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల ఎస్ఐపై చర్యలు తీసుకోండి

**: జిల్లా ఎస్పీకి రైతుల ఫిర్యాదు**

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైం : భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన ముగ్గురు రైతులు ఎస్ఐ శ్రవణ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేకు ఫిర్యాదు చేశారు. భూ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఎస్ఐ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆరోపించారు. చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన అబ్బెంగుల రాజయ్య, కైలాపూర్‌కు చెందిన బూదారపు మార్కండేయ, చల్లగరిగేకు చెందిన ఇంచర్ల లక్ష్మి ఈ ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ సమస్యను పరిష్కరించాల్సిన ఎస్ఐ సమస్యగా మారాడని వాపోయారు. ఈ మేరకు చిట్యాల ఎస్ఐ శ్రవణ్ కుమార్ స్పందిస్తూ, రైతులు భూ వివాదం అంశంపై వచ్చారని, అది సివిల్ మ్యాటర్ కావడంతో పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలని చెప్పినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే వ్యవహరిస్తున్నామని స్పష్టంచేశారు.

# పెన్షన్ మంజూరు చేయండి

**- ప్రజావాణిలో ఓ మహిళ వినతి**

అక్షరదర్బార్, పరకాల: భర్త, కుమారుడు చనిపోయి ఆదరణ లేని తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని నడికూడ మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన వీర్ల సుజాత అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. హైదరాబాద్ ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాయపర్తి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పర్నెం తిరుపతిరెడ్డి సహాయంతో ఆమె వినతి పత్రాన్ని అందజేశారు. ఐదు సంవత్సరాల క్రితం భర్త రాజమౌళి మరణించగా, ఇటీవల గ్రామ ఊర చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి కుమారుడు ప్రమాదవశాత్తు మరణించాడని, నా అనే వాళ్లు లేక ఒంటరిగా మిగిలానని, తనకు ప్రభుత్వం వితంతు పెన్షన్ మంజూరు చేయాలని అధికారులను కోరారు. దీంతో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ అధికారులు వీర్ల సుజాతకు వితంతు పెన్షన్ మంజూరు చేయవలసిందిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు.


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915